కథ

**"నేను రెడీ!" అంది సరిత ముడిమీద జాజిమాల అమర్చుకుంటూ.**

**"నువ్వు రెడీయే కానీ నిన్ను తీసుకొని వెళ్లడానికి నేను మాత్రం రెడీగా లేను" అన్నాడు శివరాం మొహం చిట్లిస్తూ.**

# తప్పదు మరి!



జి.సరస్వతి


"కమల, రాజుగారు, పెళ్లికొడుకు విక్రమ్ మనింటికి వచ్చి నిశ్చితార్థానికి తప్పకుండా రావాలని మరీ మరీ చెప్పేరు. వాళ్లమ్మాయి నీరజ, పిల్లలు కూడా ఈపాటికి అమెరికానించి వచ్చి ఉంటారు. అందరినీ చూసి సరదాగా గడిపి రావాలనుందండీ' అంది సరిత.

"పిలవగానే తయారైపోవడమేనా? పట్టుచీర, ఒంటి నిండా నగలు, కుంకుమబొట్టుతో అమ్మవారిలాగా తయారయ్యావు. నడుస్తూ ఉంటే గున్న ఏనుగు ముస్తాబై కదులుతున్నట్లుంది. నిన్ను తీసుకుని వెళ్లి నేను నవ్వుల పాలు కాలేను"

"మనం వెళ్ళేది ఫ్యామిలీ ఫంక్షన్‌కి కాని క్లబ్బులో జరిగే పార్టీకి కాదు. అంచేత నా ముస్తాబు సందర్భానికి తగినట్టుగానే ఉంది. అక్కడికి వచ్చేవారిలో చాలామందికి నాగురించి తెలుసు. ఎగతాళి చెయ్యరు లెండి. మనం కలిసి బైటకు వెళ్లి చాలాకాలం అయింది. సరదాగా వెళ్ళొద్దాం రండీ" అంది సరిత బ్రతిమాలుతూ.

"నాతో బైటకు రావాలని సరదాగా ఉందంటున్న దానివి బరువెందుకు పెంచుకున్నావు? మళ్ళీ సన్నజాజి మొగ్గలాగా తయారైతేనే బయటకు తీసుకువెళ్తాను. అంతవరకు ఇంతే. ఎలాగూ రెడీ అయ్యావు కనుక అమ్మవారి గుడికి నడుచుకుంటూ వెళ్ళు. బరువు తగ్గుతావు. నేను వెళ్తున్నా" అంటూ బయటకు వెళ్లి కారు స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు. భర్త చేసిన ఎగతాళికి గాయపడిన సరిత మనస్సు అమ్మవారి దర్శనం చేసుకున్న తరువాత కాని ఊరట చెందలేదు. ఇంటికి రాగానే చీర మార్చుకుని వచ్చి సోఫాలో వాలిపోయింది. ఆడదాని అందచందాల పట్ల భర్తకున్న మోజు తనకు తెలియనిది కాదు. అసలు అతనికున్న ఆ మోజు వల్లనే అతని స్టేటస్‌కు ఏ మాత్రం తగని తను అతని భార్యకాగలిగింది. అదంతా ఎలా జరిగిందంటే..!




* * *

చిన్నటౌన్‌లో అతి సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగిన సరిత అక్కడే చదువుకుని డిగ్రీ పరీక్షలు రాసింది. ఆ వేసవిలో పెద్దమ్మ కూతురు పెళ్లికి తల్లిదండ్రులతో పాటు విజయవాడ వెళ్లింది. ఆ పెళ్లికి పెళ్లకొడుకు తరపు బంధువులుగా శివరాం, అతని తల్లి వచ్చారు. తనను చూసిన దగ్గర్నుంచి, "మీ పేరు సరితట కదా! కాని సన్నజాజి మొగ్గ అనిపెడితే సరిగ్గా అతికినట్లుండేది" అంటూ శివరాం సరిత వెంటపడ్డాడు. అంతటితో ఊరుకోకుండా తన తల్లికి పరిచయం చేశాడు. ఆవిడ సరితను చూసి ముచ్చటపడింది. అప్పటికప్పుడే సరిత తల్లిదండ్రులను పరిచయం చేసుకుని సరితను కోడలిగా చేసుకుంటానని చెప్పింది. ఆమె మాటలు విని అందరూ ఇది కలా? నిజమా? అంటూ అబ్బురపడిపోయారు. కొందరు మాత్రం శివరాం గుణశీలాల గురించి గుసగుసలాడుకున్నారు. కోరి అడిగినంత మాత్రాన శివరాంలో లోపాలున్నాయని అనుమానించనవసరంలేదని పెళ్లికొడుకు కూడా చెప్పడంతో ఆ పెళ్ళిపందిట్లోనే తాంబూలాలు పుచ్చేసుకుని పెళ్లికి ముహూర్తం పెట్టేసుకున్నారు.

పెళ్లయిన వెంటనే సరిత, శివరాం తిరుపతి వెళ్ళి దైవద

ర్శనం చేసుకుని, అక్కడినించి కొడైకెనాల్ వెళ్లారు. తరువాత మద్రాసు వచ్చారు. శివరాం ఒక కంపెనీలో ఇంజనీర్. బాగా ఆస్తిపాస్తులున్నవాడు. బంగ్లాలో కాపురం, తిరగడానికి కారు, బీరువానిండా ఖరీదైన చీరలు, వజ్రాల నగలూ, ప్రాణంగా చూసుకునే భర్త, అత్తగారు. రోజూ సాయంత్రం శివరాంకు నచ్చినట్లు ముస్తాబై సరదాగా తిరిగిరావడంతో సరితకు రోజులు క్షణాలలాగా దొర్లిపోతూ వచ్చాయి. శివరాంకి తాగడం, ఆడవాళ్లతో తిరగడం అలవాటని తెలిసిన రోజున తన బ్రతుకుబండలై పోయినట్లు మొదటిసారిగా కన్నీరు మున్నీరుగా ఏడ్చింది సరిత. అత్తగారు అక్కున చేర్చుకుని ఓదార్చింది.

"ఎన్నో కాన్పులు నష్టపోయాక దక్కాడని గారాబం చేశామమ్మా! బాగా చదువుకుంటున్నాడని మురిసిపోయాం. అడిగినంత డబ్బు ఇస్తూ ముద్దుచేసేం. దురభ్యాసాలకు లోనవుతాడని కలలో కూడా ఊహించలేదు. అయినా వాడికి నువ్వంటే ప్రాణం. వాడింట్లో ఉన్నంతసేపు ఓర్పుతోవాడు సంతోషంగా ఉండేటట్లు చూసుకో అమ్మా! అందువల్ల పూర్తిగా మానుకోకపోయినా, కొంతవరకూ కంట్రోల్‌లో ఉండగలుగుతాడు. నా సపోర్ట్ నీకెప్పుడూ ఉంటుంది"

ఒకసారి పుట్టింటికి వెళ్లినప్పుడు మనస్సుండబట్టక తల్లితో చెప్పుకుని బాధపడింది. శివరాంతో గొడవపడి సంసారాన్ని రట్టు చేసుకోవడం తెలివైన పనికాదని, అత్తగారు చెప్పినట్లు నడుచుకోమని మనసుని సమాధానపరుచుకుని హితవు చెప్పింది తల్లి. అత్తగారు చెప్పినట్లు నడుచుకుంటూనే రూపకు, రవికి తల్లయింది సరిత. పిల్లల ఆటపాటలు చూస్తూ సంతృప్తిగా కన్నుమూసింది అత్తగారు.

పిల్లల పెంపకంతో శ్రమగా అనిపించినా తన అందాన్ని, నాజూకుదనాన్ని కాపాడుకుంటూ భర్త వెంట పార్టీలకు వెళ్తూనే ఉండేది సరిత. కాని ఆమె మనస్సంతా ఇంట్లో ఉన్న పిల్లల మీదే ఉండేది. రూప, రవి స్కూల్లో చేరి చదువుకోవడం మొదలుపెట్టాక ఆమెకు కొంత స్థిమితం చిక్కింది.

"ఏమండీ! పెళ్లయినప్పటినుంచి మీరు కోరినట్లు గానే నడుచుకుంటున్నాను కదా! నా కోరిక మీరు తీరుస్తారా?" అని అడిగింది సరిత శివరాంను.

"ఎందుకు తీర్చను సరితా! ఏంకావాలో చెప్పు. కొత్త ఫ్యాషన్ నగలా, చీరలా? కొత్త మోడల్ కారా? హాలీడే ట్రిప్‌కు లండన్ వెళ్దామా?" అని అడిగాడు ప్రేమగా.

"నాకవేం ఒద్దండీ! త్రాగడం, తిరగడం మానేసి నాతోబాటు గుడికి రావాలండీ! ఈరోజు మన పెళ్లిరోజు కదా! అమ్మవారికి అర్చన చేయిద్దామండీ" అంది ఆశతో.

"తీర్చలేని కోరికలు కోరినన్ను ఇబ్బంది పెట్టకు సరితా! నాదారిన నన్ను పోనివ్వు. అది ఇద్దరికీ మంచిది. నువ్వే గుడికి వెళ్ళి నా పేరున కూడా అర్చన చేయించు" అనేసి లేచి వెళ్లిపోయాడు.

'తను ఇద్దరికీ మంచిదికాని దారిలో నడుస్తున్నట్లు ఎప్పటికి తెలుసుకుంటారో ఏమో!' అనుకుంది సరిత బాధపడుతూ.

★ ★ ★

రూప యూనివర్శిటీలో ఎం.ఎస్.సిలో చేరింది. రవి ఇంజనీరింగ్‌లో చేరాడు. మెనోపాజ్‌కు వచ్చిన సరిత ఆరోగ్యసమస్యలు ఎదురుకావడంతో హాస్పిటల్‌లో చేరి పెద్దాపరేషన్ చేయించుకోవలసి వచ్చింది. ఆ కారణంగా రెస్ట్ తీసుకోవలసి రావడంతో డైట్ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉన్నా కొంచెం లావెక్కింది.

సరిత ఆకారంలో వచ్చిన మార్పు శివరాంకి బొత్తిగా నచ్చలేదు. అంచేత ఆమె ఆరోగ్యం చక్కబడిన తరువాత కూడా ఆమెను తనతోబాటు తీసుకుని వెళ్లడం మానేశాడు. ఇంట్లో ఉన్నప్పుడు కూడా ముభావంగా ఉండసాగాడు. శివరాం ప్రవర్తన సరితకు క్షోభ కలిగించింది. మనసుతో అనుబంధంతో పెంచుకోకుండా కేవలం తన అందచందాల పట్ల ఉన్న ఆకర్షణతోనే తనతో పాతికేళ్ళు సంసారం చేశాడనే భావం ఆమెలో కలిగి ఆమెను చిత్రవధ చేయసాగింది.

ప్రాణస్నేహితురాలు కమల వచ్చి కొడుకు నిశ్చితార్థానికి రమ్మని పిలిచినప్పుడు సరితకెంతో ఆనందం కలిగింది. చాలాకాలం తరువాత శివరాంతో బయటకు వెళ్ళే అవకాశం వచ్చిందనుకుంది. కానీ శివరాం తనతో తీసుకెళ్లడానికి నిరాకరించడమే కాకుండా ఎగతాళిగా కూడా మాట్లాడడంతో సరిత మనస్సు గాయపడింది.

★ ★ ★

రాత్రి పదిగంటలకు శివరాం ఇంటికి వచ్చి జోళ్ళు విప్పేసి సరితను గమనించనట్లుగానే బెడ్‌రూంలోకి వెళ్ళిపోయాడు. ఫంక్షన్ విశేషాలు అడిగి తెలుసుకుందామనే ఉద్దేశ్యంతో సరిత కూడా అతని వెనకాల వెళ్లింది. శివరాం బట్టలైనా మార్చుకోకుండా బెడ్‌మీద వాలిపోయాడు.

"ఫంక్షన్ బాగా జరిగిందా?" అని అడిగింది సరిత.

"బాగానే జరిగింది" ముక్తసరిగా బదులిచ్చాడు.

"ఏ ఫంక్షన్‌కు వెళ్లినా విశేషాలన్నీ పూసగుచ్చినట్లు చెప్పడం మీకు అలవాటు కదా! డల్‌గా ఉండిపోయారేం?" అని అడిగింది సరిత అతని వైపు పరిశీలనగా చూస్తూ.

"మనస్సు బాగాలేకపోతే డల్‌గా కాక ఉత్సాహంగా ఎలా ఉంటాను?"

"ఏమైందండీ!" అని అడిగింది ఆత్రుతగా.

"పరిచయం చెయ్యగానే నీరజ పిల్లలిద్దరూ. 'తాతా..తాతా' అంటూ వెంటపడ్డారు. "మా మనవలు నిన్ను అడ్వాన్స్‌గానే తాతను చేసేశారోయ్" అంటూ రాజుగారు నవ్వడం, "ఆకారాన్ని బట్టి పిల్లలకు వరుస తెలిసిపోయినట్లుంది. తెలివైన పిల్లలే.." అని కొందరు నా వైపు ఎగతాళిగా చూడడం తలకొట్టేసినట్లు అయిపోయిందనుకో. అవునూ నేను ముసలివాడిలాగా కనబడుతున్నానా సరితా?" అడిగాడు దిగులుగా.

సరిత లోలోపల నవ్వుకుంది.

"పిల్లలు దైవ స్వరూపులండీ. అబద్ధం చెప్పరు" అంది.

"అంటే! పిల్లవెధవలు తాతా అని పిలిచారని నువ్వు కూడా నన్ను ముసలివాడుగా నిర్ధారణ చేసేశావన్నమాట" అన్నాడు ఉడుక్కుంటూ.

"నిర్ధారణ చేసేది నేను కాదండీ! మీ బట్టతల, పండు మీసాలు, బొజ్జ చూడగానే ఎవరైనా ముసలివాడనే అనుకుంటారు"

"అమ్మమ్మలాగ ఉన్నావని, గున్న ఏనుగులాగా తయారయ్యావని వెక్కిరించానని నీకు కోపం. సమయం వచ్చిందని నామీద అక్కసు తీర్చుకుంటున్నావు"

"మీరు వెక్కిరించినందుకు నాకు కోపం లేదండీ! ఎందుకంటే మనకిష్టం లేకపోయినా పెరిగే వయసుతోపాటు ఆకారంలో కూడా మార్పులు వచ్చి తీరతాయనే నిజం నాకు తెలుసు. మీరు మాత్రం ఆ నిజాన్ని గ్రహించకుండా పెళ్లినాటి సన్నజాజి మొగ్గలాగా లేనని కించపరుస్తూ వచ్చేరు. అందుకే బాధపడ్డాను. సన్నజాజి మొగ్గ మాత్రం అలాగే ఉండిపోతుందా? వికసించి సువాసన వెదజల్లి రాలిపోతుంది. మనమధ్య ఎప్పటికీ ఉండవలసింది ఆ పరిమళం లాంటి ప్రేమానుబంధమండీ"

"చిన్నగా ఆకర్షణీయంగా కనబడాలనుకోవడం తప్పా?"

"తప్పుకాదు. కాని పెరిగే వయస్సు శరీరం మీద ప్రభావం చూపకుండా ఉంటుందా? నడివయస్సు దాటాక మొహం మీద ముడుతలు వచ్చాయని, జుట్టు నెరుస్తుందని కుమిలిపోయి వాటిని కప్పిపుచ్చాలనుకోవడం, తగని ముస్తాబుతో చిన్నగా కనబడాలని తాపత్రయపడడం చేస్తే ఎబ్బెట్టుగా కనబడి నవ్వుల పాలవుతాం. అవి జీవితాభవాలకు గుర్తులని, అవి ప్రకృతి సహజంగా వచ్చేవి కనుక ఇష్టం ఉన్నా లేకపోయినా ఆమోదించక తప్పదని గ్రహించి తగినవిధంగా నడుచుకోవడం హుందాగా ఉంటుంది"

ఆమె మాటలను మనస్సుకు పట్టించుకుంటున్నట్లు శివరాం మౌనంగా ఉండిపోయాడు.

"మీకు వినడానికి కష్టంగా ఉన్నా ఒక నిజాన్ని చెప్పక తప్పదండీ. మీ అలవాట్లు మంచివైతే ఇప్పటికీ చిన్నగా కనబడేవారు. నాకు కూడా ఆరోగ్యసమస్యలు వచ్చి ఉండేవి కాదు" సరిత గొంతు గద్గదమైంది. కళ్ళు తుడుచుకుంటూ గదిలోంచి బైటకు నడిచింది.

పాలగ్లాసుతో వచ్చిన సరితను దగ్గరకు తీసుకున్నాడు శివరాం.

"ఇంతకాలం నీకు క్షోభ కలిగించాను. నన్ను క్షమించు సరితా! రాజుగారి మనవలు నన్ను తాతా అనిపిలిచి ఉండకపోతే మనం మనస్సులు విప్పి మాట్లాడుకునే అవకాశం వచ్చి ఉండేది కాదు. నిజంగా పిల్లలు గొప్ప మేలుచేశారు" అన్నాడు మనస్ఫూర్తిగా.

★ ★ ★

ఏడాది నిండిన రూప కొడుకు చేత 'తాతా' అని పిలిపించుకుంటూ ఆనందంతో పొంగిపోతున్న శివరాంను చూస్తూ తృప్తిగా నవ్వుకుంది సరిత.